

మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్‌కు ఘన స్వాగతం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి ఆశిష్ షెలార్‌కు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద బీజేపీ నాయకుడు ఘన స్వాగతం పలికారు. గురువారం నగర శివారులోని రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన ఓ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిల్మ్‌సిటీ ప్రధాన గేటు వద్ద బీజేపీ శ్రేణులు మంత్రిని శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నరసింహరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు రమాదేవి, వడ్డేపల్లి పాపయ్యగౌడ్, రంగ జంగమయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, వీరస్వామిగౌడ్, శ్రావణ్‌చారి, యాదగిరి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ శ్రీనివాస ఆసుపత్రి ముందు సర్వీసు రోడ్డు లెవల్‌ను పరిశీలిస్తున్న జాతీయ రోడ్డు విస్తరణ నిర్మాణ సంస్థ అధికారులు, కార్పొరేటర్

ప్రమాద భరితంగా సర్వీస్ రోడ్లు : కార్పొరేటర్

హయత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డుల ఏర్పాటుతో వాటికి అనుసంధానంగా ఉన్న కాలనీల రోడ్లు ప్రమాద భరితంగా మారాయని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి జాతీయ రోడ్డు విస్తరణ నిర్మాణ సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆ సంస్థ అధికారులు ప్రమాద భరితంగా మారిన రోడ్లను కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ శ్రీనివాస ఆసుపత్రి ముందు రోడ్డు లెవల్‌ను పరిశీలించారు. బస్సు డిపో రోడ్డుకు దాదాపు 10 ఫీట్ల ఎత్తులో సర్వీస్ రోడ్డును నిర్మించారు. దీంతో ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నట్లు కార్పొరేటర్ అధికారులకు వివరించారు. ఇప్పటికైనా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేసి బ్లాక్ టాప్ రోడ్లుగా మార్చాలని కార్పొరేటర్ అధికారులను కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా శుక్రవారం 11కేవీ శాలివాహన నగర్ ఫీడర్ పరిధిలోని ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూ హనుమాన్ టెంపుల్, భవానీ నగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్ ప్రాంతాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ ఉండదని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.



రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో భాగంగా జీరో ప్లాస్టిక్-2040 క్లీనింగ్ యాక్టివిటీలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు

- రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆంధ్రజ్యోతి

చేతికొచ్చిన పంట.. చేజారె

- తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్నరైతన్నలు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. దాంతో పాటు అక్కడక్కడ కూరగాయల పంటలకు కూడా నష్టం వాటిల్లింది. మరో వారం రోజుల్లో కల్లాలకు చేరాల్సిన వరిధాన్యం తుఫాన్ మూలంగా పంట పొలాల్లోనే రాలి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన మాచగోని నర్సమ్మ రైతు తన నాలుగు ఎకరాల్లో వరి సాగుచేసింది. ప్రస్తుతం పంట కోతకు సిద్ధంగా ఉంది. రెండు రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు సుమారు 3 ఎకరాల వరి నేల కొరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రాకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటకు ప్రభుత్వం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



అబ్దుల్లాపూర్‌లో నేలకొరిగిన వరి పంట

అష్టలక్ష్మీ ఆలయంలో శృంగేరి పీఠాధిపతి

ఎల్‌బీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విజయయాత్రలో భాగంగా శృంగేరీ పీఠాధిపతులు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి ఆర్‌కేపురం వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ముందుగా గణపతి ఆలయాన్ని దర్శించుకున్న ఆయన అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ధ్వజ స్తంభం, గోశాలను దర్శించి గోపూజ చేశారు. కళ్యాణ మండల ప్రాంగణంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు స్వామివారిని ఘనంగా సన్మానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు దంపతులు స్వామి వారి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, తేలుకుంట్ల రమేష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్, చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ దేవాలయ గోశాలలో గోసేవ చేస్తున్న విధుశేఖర భారతీ మహాస్వామి

తట్టిఅన్నారంలో విగ్రహ ప్రతిష్ఠాపన

అబ్దుల్లాపూర్‌మెట్, (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని మారుతి నగర్ కాలనీలో గురువారం సీతారామాంజనేయ పంచాయతన దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. హాజరైన విధుశేఖర భారతీ మహాస్వామి దేవత విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డిజిటల్, స్మార్ట్ తరగతులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు మెరుగైన విద్య కోసం ఆజంపురలోని ఐడీయల్ ఇన్స్పిరేషన్ సెంటర్ ఫర్ డిజబుల్డ్‌లో డిజిటల్, స్మార్ట్ తరగతి గదులను జమాతే ఈ ఇసామీ హింద్ అమీర్ మెట్రో సిటీస్ ఆఫ్ ఇండియా కోఆర్డినేటర్ మహ్మద్ అజారుద్దీన్ ప్రారంభించారు. గురువారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు మహ్మద్ ముబషీర్ అహ్మద్ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని మొట్టమొదటి దివ్యాంగుల సంస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేర్చడం డిజిటల్, స్మార్ట్ తరగతులను ప్రవేశపెట్టడం ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. నాణ్యమైన, సమగ్ర విద్య వైపు దివ్యాంగులు ముఖ్యమైన అడుగులు వేశారన్నారు.

మలక్‌పేటలో విద్యుత్ అధికారుల బస్తీబాట

చాదర్‌ఘాట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలోని 11 సెక్షన్ల పరిధుల్లోని ప్రాంతాల వారీగా అధికారులు, సిబ్బంది గురువారం బస్తీబాట నిర్వహించారు. ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో సీబీడీ ఏడీఈ ఇమ్రాన్‌తోపాటు, ఏడీఈలు, ఏఈలు, వారితోపాటు ఒక్కో సెక్షన్‌లో 10 మంది సిబ్బంది బస్తీబాటలో పాల్గొన్నారు. రోజువారీగా వచ్చే విద్యుత్ సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించారు. 10 విద్యుత్ ఫీడర్లకు రెగ్యులర్ నిర్వహణ పనులు నిర్వహించారు. వీటితోపాటు 47 ట్రాన్స్‌ఫార్మర్లకు రెగ్యులర్ మరమ్మతులు చేశారు.

నేడు ఉచిత మొక్కల పంపిణీ

వనస్థలిపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని శుక్రవారం ఉచిత ఔషధ, పండ్ల, పూల మొక్కల పంపిణీ కార్యక్రమం వనస్థలిపురం గణేష్ దేవాలయం సమీపంలోని మొదటిముద్ద వద్ద నిర్వహిస్తున్నట్లు జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు (తులసి, ఉసిరి, మారేడు, రణపాల, అశ్వగంధం, ఇన్సులిన్, గోరింటాకు, అలవేర) పండ్ల మొక్కలు (దానిమ్మ, బొప్పాయి, జామ, సీతాఫలం) పూల మొక్కలు (మందార, గుండుమల్లి, నందివర్ధనం, మునగ, మనీప్లాంట్)లను ప్రతి ఒక్కరికి రెండు చొప్పున ఉచితంగా అందజేయడానికి సిద్ధం చేశామన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

ఎల్‌బీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో భాగంగా ఆర్కేపురం డివిజన్ పరిధిలోని శ్రీరామకృష్ణాపురం కాలనీ పార్కులో గురువారం అశ్వత్థా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐటీడీఈఎస్ కో ఆపరేటివ్ సొసైటీ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆమలకవృక్ష (ఉసిరి) పూజ, తులసీ పూజ, గోపూజలను నిర్వహించారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హత్య కేసు నిందితుడి ఇంట్లో చోరీ

రూ.5 లక్షలు, ఆరు తులాల బంగారం మాయం

సైదాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితుడి తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి రూ.5 లక్షల నగదు, ఆరు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. చావునిలో నివసించే మీర్ సామి అలీ, భార్య యాస్మిన్ బేగం చేతబడి అనుమానంతో సోదరి కుమార్తె (8)ను చేతులు కట్టేసి ఇంటిపై వాటర్ ట్యాంక్‌లో పడవేసి హత్య చేశారు. ఈ కేసులో ఈనెల 4న భార్యభర్తలను మాదన్న పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో నిందితుడి ఇంటికి తాళం వేసి ఉంది. గురువారం ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించిన స్థానికులు నిందితుడి బంధువుకు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి చూడగా బీరువా తాళం తెరిచి ఇంట్లోని సామాను చిందరవందరగా పడి ఉండడం గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.5 లక్షల నగదు, ఆరు తులాల బంగారం మాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మాదన్న పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతల సస్పెన్షన్ తొలగింపు

సైదాబాద్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు అముదాల మదన్‌బాబు, సీనియర్ కాంగ్రెస్ నేత గంట్ల కృష్ణలపై అధిష్ఠానం గురువారం సస్పెన్షన్ తొలగించినట్లు పార్టీ క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ ఏ.శ్యామ్ మోహన్ రావు ప్రకటించారు. కమిటీ చైర్మన్ మల్లు రవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. జూన్26న గాంధీభవన్‌లో మలక్‌పేట నియోజకవర్గం సమావేశంలో జరిగిన గొడవ కారణంగా మదన్‌బాబు, గంట్లకృష్ణను నగర అధ్యక్షుడు వలీ ఉల్లా సమీర్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌పై నియోజకవర్గం పార్టీలో తీవ్ర వ్యతిరేకతలు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ చర్చించి నిర్ణయం తీసుకుంది.

డ్రైవర్ అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న కేశవులు

హయత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్నూలులో జరిగిన బస్సు అగ్ని ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని రంగారెడ్డి అగ్నిమాపక శాఖ అధికారులు గురువారం హయత్‌నగర్‌లోని రెండు ఆర్టీసీ బస్సు డిపోల్లో కార్మికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. వారు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. బస్సు డిపోలో ఆయిల్ ఉంటుంది కనుక కార్మికులు సిగరెట్లు తాగవద్దని సూచించారు. ప్రమాద సమయంలో బస్సు అద్దాలను ఎలా ధ్వంసం చేయాలో, మంటలను ఏ విధంగా ఆర్పివేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

చేనేత మహాధర్నాకు సహకరించండి

మన్సూరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై నవంబరు 20న చేనేత, వస్త్ర పరిశ్రమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నాకు సహకరించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, శిల్పవల్లికి గురువారం వినతి పత్రం సమర్పించారు.

'నాలా పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి'

మన్సూరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరదనీటి నాలా పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్‌యాదవ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ శ్రీసాయినగర్‌కాలనీ ప్రధానరోడ్డులో రూ.28 లక్షలతో చేపట్టిన ధ్వంసమైన వరదనీటి నాలా స్లాబు పనులను గురువారం కార్పొరేటర్ చింతల అరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్, సభ్యులు యాదగిరి, హన్మంత్‌రావు, రమేష్, అశోక్, మురళి, లక్ష్మయ్య, అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.